www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 8 అక్టోబర్ 2024
5
ఏలూరు

మద్యం షాపులకు 2,643 దరఖాస్తులు

జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య

ఏలూరు అర్బన్ : నూతన మద్యం షాపులకు జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రానికి 2,643 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం వరకు సుమారు 1,100 దరఖాస్తులు రాగా మంగళవారం ఒక్కరోజు 1500 పైనే దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఏలూరు స్టేషన్ పరిధిలో 176, చింతలపూడి స్టేషన్ పరిధిలో 385, భీమడోలు స్టేషన్ పరిధిలో 651, పోలవరం స్టేషన్ పరిధిలో 330, జంగారెడ్డిగూడెం స్టేషన్ పరిధిలో 568, కైకలూరు స్టేషన్ పరిధిలో 279, నూజివీడు స్టేషన్ పరిధిలో 254 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని, ఆన్‌లైన్ దరఖాస్తుల వల్ల ఈ సంఖ్య గంటగంటకు పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

సిండికేట్ 'టెండర్'..!

నేటితో ముగియనున్న మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

11న దుకాణాల కేటాయింపు, 12న మద్యం అమ్మకాలు ప్రారంభం

ఇప్పటి వరకూ 'పశ్చిమ'లో 175 దుకాణాలకు 2,300, ఏలూరు జిల్లాలో 144 దుకాణాలకు 2,400 దరఖాస్తులు

ఎంఎల్‌ఎల కనుసన్నల్లోనే అంతా అంటూ విమర్శలు

గీత కార్మికులకు దుకాణాల కేటాయింపుపై నాన్చుడు

'మద్యం టెండర్ల దరఖాస్తు ప్రక్రియ సిండికేట్ వ్యవహారంగా మారిందా.. ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధులు తాము అనుకున్నట్లుగానే వ్యవహారం సాగిస్తున్నారా.. టెండర్ వేయాలనుకునే వ్యక్తులు ముందుగా ఎంఎల్‌ఎలను కలుసుకోవాలని హుకుం జారీ చేశారా.. దీంతో ఏ మద్యం దుకాణానికి ఎంతమంది టెండర్ వేయాలో.. అందులో ఎవరుండాలో ఎంఎల్‌ఎలే నిర్ణయించారా.. ప్రతి మద్యం దుకాణంలోనూ ప్రజాప్రతినిధులకు వాటాలు ఇచ్చేలా ఒప్పందాలు జరిగిపోయాయా'.. అంటే అవుననే సమాధానం వస్తోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గత ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాలు ప్రభుత్వ దుకాణాల ఆధ్వర్యంలోనే నడిచాయి. సరైన బ్రాండ్లు లేకుండా చేశారని, మద్యం ధరలు విపరీతంగా పెంచేయడం, ఆన్‌లైన్ చెల్లింపులు లేకపోవడం అనేక అంశాలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను పెంచాయి. దీంతో మద్యం అమ్మకాలను ప్రయివేటుకు అప్పగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఈ నెల ఒకటో తేదీ నుంచి మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చేపట్టింది. తొమ్మిదో తేదీ బుధవారం సాయంత్రం ఆరు గంటలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగియనుంది. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలోని 144 దుకాణాలకు 2,400 దరఖాస్తులు రాగా, పశ్చిమగోదావరి జిల్లాలోని 175 మద్యం దుకాణాలకు 2,300 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. చివరి రోజు బుధవారం పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిన తర్వాత 11వ తేదీన టెండర్లు తెరిచి దుకాణాలను కేటాయిస్తారు. 12 నుంచి దుకాణాలను ప్రారంభించే అవకాశం ఉంటుంది.

గీత కార్మికులకు పది శాతం దుకాణాల కేటాయింపు ఏది?

మద్యం దుకాణాల్లో పది శాతం గీత కార్మికులకు కేటాయిస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆ ప్రకారం చూస్తే ఏలూరు జిల్లాలో 15, పశ్చిమలో 18 వరకూ దుకాణాలను గీత కార్మికులకు కేటాయించాల్సి ఉంది. ఇప్పటి వరకూ గీతకార్మికులకు దుకాణాల కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం ఎటువంటి ఉత్తర్వులనూ విడుదల చేయలేదు. ప్రస్తుతం ఓపెన్ కేటగిరిలో జరుగుతున్న దరఖాస్తుల ప్రక్రియ పూర్తిచేసి, దుకాణాల కేటాయింపు జరిగిన తర్వాత గీతకార్మికులకు సంబంధించిన దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ మొదలవుతుందని చెబుతున్నారు. కల్లుగీతను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వం ఈ వ్యవహారం ముందుకు తెచ్చిందనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. గీత కార్మిలకు కేటాయించిన దుకాణాలపైనా ప్రజాప్రతినిధులు తమ పూర్తి ఆధిపత్యం కొనసాగించేందుకు వ్యూహాలు రచించినట్లు తెలుస్తోంది.

అంతా ఎంఎల్‌ఎల కనుసన్నల్లోనే..?

ఉచిత ఇసుక సరఫరాలో జనం నుంచి తీవ్ర వ్యతిరేకతను కూటమి ప్రభుత్వం మూటగట్టుకుంది. ఇప్పుడు మద్యం దుకాణాల దరఖాస్తుల వ్యవహారం సైతం జనంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మద్యం దుకాణాల్లో తమకు వాటా కచ్చితంగా ఇవ్వాలంటూ చాలామంది ఎంఎల్‌ఎలు పట్టుబట్టుకుని కూర్చున్నట్లు చర్చ నడుస్తోంది. ఎంఎల్‌ఎల కుమారులు, ఎంఎల్‌ఎల తరపున స్థానిక ప్రజాప్రతినిధులు ఈ తతంగం నడిపిస్తున్నట్లు చెబుతున్నారు. ఈసారి మద్యం దుకాణాల దరఖాస్తులకు సంబంధించి ప్రభుత్వం కొన్ని నిబంధనలను పెట్టింది. దరఖాస్తు చేసిన వ్యక్తులు రూ.రెండు లక్షలు నాన్ రిఫండబుల్ చెల్లించాలని నిబంధన విధించింది. గతంలో ఇది రూ.50 వేలు మాత్రమే ఉండేది. దరఖాస్తు చేసిన తర్వాత టెండర్ దక్కకపోతే రూ.రెండు లక్షలు వదులుకోవాల్సిందే. దీన్ని అదునుగా తీసుకుని ఎంఎల్‌ఎలు చక్రంతిప్పిన పరిస్థితి ఉంది. ఎవరికి వారే దరఖాస్తు వేస్తే దుకాణం దక్కకపోతే రూ.రెండు లక్షలు కోల్పోవాల్సి వస్తుందని, అలాకాకుండా సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తు చేస్తే బాగుంటుందనే ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. దుకాణం దక్కినవారు మిగిలిన వారికి వాటా ఇవ్వడం, కొంత సొమ్ము ఇవ్వడం వంటి ఒప్పందాలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. దరఖాస్తు చేయాలనుకునే వారంతా ముందుగా తమను కలవాలని ఎంఎల్‌ఎలు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఏ దుకాణానికి ఎంతమంది టెండర్ వేయాలో ఎంఎల్‌ఎల కనుసన్నల్లోనే సాగుతున్నట్లు సమాచారం.

దుకాణంలో 40 శాతం ఎంఎల్‌ఎ, ఆయన అనుచరులకు వాటా ఇచ్చే విధంగా ఒప్పందాలు చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. డెల్టాలో దుకాణాల్లో వాటాల వ్యవహారం ముందుగానే తెరపైకిరాగా, తర్వాత మిగిలిన చోట్ల మొదలైనట్లు తెలుస్తోంది. ఏదేమైనా మద్యం దుకాణాలపై ఎంఎల్‌ఎల పెత్తనం కొనసాగనుందని స్పష్టంగా అర్థమవుతోంది. ఇక అర్ధరాత్రైనా, అపరాత్రైనా మద్యం దుకాణాలు కొనసాగే అవకాశం ఉంటుందని, పోలీసులు అటువైపు వెళ్లే అవకాశం ఉండదనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

సామ్‌సంగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

నిరసన తెలుపుతున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమిళనాడులోని సామ్‌సంగ్ పరిశ్రమలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సామ్‌సంగ్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని, చట్ట ప్రకారం యూనియన్‌ను అంగీకరించి చర్చలు జరపాలని పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ తమిళనాడులో సామ్‌సంగ్ పరిశ్రమ కార్మికులు గత నెల రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణకొరియాకు చెందిన సామ్‌సంగ్ సంస్థ పరిశ్రమలో కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటుందని, వేతనాలు ఇవ్వాలని అడిగితే కార్మికులపై వేధింపులకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలో యూనియన్ కూడా ఏర్పాటు చేసుకోనీయకుండా కార్మికులపై తీవ్ర నిరంకుశ పద్ధతులకు పాల్పడినా, కార్మికులంతా సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ ఏర్పాటు చేసుకుని నెల రోజులుగా పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి సామ్‌సంగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వివిఎన్ ప్రసాద్, బి.జగన్నాధరావు, కె.విజయలక్ష్మి, జె.గోపి, రాఘవ, శేఖర్, సత్యనారాయణ, టికె.రావు పాల్గొన్నారు.

14 నుండి పల్లె పండుగ వారోత్సవాలు

సంక్రాంతి నాటికి రహదారులు, డ్రెయిన్ల నిర్మాణం

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి

డిప్యూటీ సిఎం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులను సత్వరమే మొదలుపెట్టేలా రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో ఈ నెల 14వ తేదీ నుంచి వారం రోజుల పాటు పల్లె పండుగ నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి పవన్‌కళ్యాణ్ చెప్పారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఈ నెల 14 నుంచి నిర్వహించనున్న పల్లె పండుగపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ నుంచి పల్లెపండుగ వారోత్సవాలను నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్‌ఆర్ఇజిసి కింద పల్లెపండుగ వారోత్సవాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించి వారిని భాగస్వాములను చేసే దిశగా కార్యాచరణ ఖరారు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఆయా ప్రాధాన్యత పనులు చేపట్టేందుకు ఇసుక సమస్య లేదని తెలిపారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడుతూ ఉపాధి హామీ కింద చేపడుతున్న పనుల వివరాలను ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ కెఎస్-ఎస్.సుబ్బారావు, డ్వామా పీడీ కె.వెంకట సుబ్బారావు, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎన్‌వివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

లోబ్రిడ్జి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తాత్కాలిక చర్యలు కాదు.. శాశ్వత పరిష్కార మార్గాలే ప్రజాశ్రేయస్సుకు ముఖ్యమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. నగరంలో పవర్‌పేటలో నిర్మించిన రైల్వే అండర్‌గ్రౌండ్ బ్రిడ్జిలో అధికంగా నీరు ఊరి ప్రమాదకరంగా మారుతోందని సామాజిక కార్యకర్త బికెఎస్‌ఆర్.అయ్యంగార్ ఎంఎల్‌ఎ చంటి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన 2017లో వరంగల్‌లోని నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారావు ఆధ్వర్యంలో నిపుణుల బృందం ఈ బ్రిడ్జిని పరిశీలించి ఇచ్చిన నివేదికను మరోసారి బయటికి తీయించారు. ప్రొఫెసర్ పాండురంగారావును మంగళవారం ఏలూరు రప్పించి బ్రిడ్జి ప్రాంతాన్ని ఆయనతో కలిసి పరిశీలించారు. బ్రిడ్జి కుంగిపోకుండా, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా అతితక్కువ కాల వ్యవధిలో సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టాలని ఎంఎల్‌ఎ కోరారు. ప్రజల రాకపోకలు ఎక్కువగా సాగే లోబ్రిడ్జిలోకి ప్రస్తుతం అతిగా నీరు ఊరడంతోపాటు ఇసుక కూడా భూగర్భం నుండి బయటకు వచ్చి ఆ ప్రాంతం కుంగిపోయే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో వరంగల్ నిట్‌కు చెందిన స్ట్రక్చరల్ ఇంజినీర్లు, వాటర్ రీసోర్స్ ఇంజినీర్ల బృందాలు త్వరలోనే ఏలూరు చేరుకుని మరోసారి లోబ్రిడ్జిని పరిశీలించి, చర్యలు చేపట్టేందుకు సహకరించాలని నిట్ డైరెక్టర్‌కు లేఖ రాస్తానని ఎంఎల్‌ఎ చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఇన్‌ఛార్జి కమిషనర్ జి.చంద్రయ్య, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, అమరావతి అశోక్, గూడవల్లి వాసు, సామాజిక కార్యకర్త బికెఎస్‌ఆర్.అయ్యంగార్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

శాంతిభద్రతలు కాపాడేందుకు పూర్తిస్థాయి కృషి

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుక పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ చెప్పారు. జిల్లా పోలీస్ బస్సు ద్వారా రంగంలోకి దిగారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఆయన విధులు నిర్వహించారు. ఆయన స్వయంగా ఏలూరు నగరంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్, వట్లూరు ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా రైల్వేస్టేషన్‌లో, బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికుల వద్ద నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక ఏలూరు శివారు టోల్‌గేట్ వద్ద ఎస్‌పి వాహన తనిఖీలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న పోలీసు బీట్‌లను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ తానే వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కచ్చితంగా నిఘా వ్యవస్థను పునరుద్ధరిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు శాంతి పద్ధతులకు పరిరక్షించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆయనతో పాటు ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్, కైకలూరు టౌన్ సిఐ శ్రీకృష్ణ, ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి


ఉపాధ్యాయ సంఘాల నాయకులతో బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - చింతలపూడి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. ఆయన చింతలపూడిలోని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులను మంగళవారం కలిసి రానున్న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు ఎంఎల్‌సిగా అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో తన గొంతు వినిపించి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయులు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిబిఐ అధికారినంటూ ఫోన్ కాల్స్

ఇద్దరి ఖాతాల్లోంచి రూ.లక్ష అపహరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఇటీవల కాలంలో సైబర్ నేరాలు బాగా పెరుగుతున్నాయి. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వాట్సప్ కాల్స్ కాని, వీడియో కాల్స్ కాని, టెక్స్ట్ మెసేజ్లు, ఎపిక్ ఫైల్స్ ఓపెన్ చేసినా మోసగాళ్ల బారిన పడటం ఖాయమని ఇటీవల సంఘటనలు రుజువు చేస్తున్నాయి. తాజాగా ఉంగుటూరు మండలంలో పలువురు ఇలాంటి మోసాలకు గురయ్యారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఓ ఉపాధ్యాయుడికి 92 సీరీస్ కలిగిన నెంబరు నుంచి ఫోను చేసిన అపరిచితులు మీ అమ్మాయి డ్రగ్స్‌తో దొరికిందని చెప్పి అవతల వ్యక్తి లంచం డిమాండు చేశాడు. ఉంగుటూరులో ఇద్దరు వ్యాపారులకు వాట్సప్‌లో యూనియన్ బ్యాంకు డీపీతో కలిగిన నెంబరు నుంచి మాల్వేర్ ఫైల్ పంపి ఇద్దరు అకౌంట్‌లో చెరొక రూ.50 వేలు వంతున మొత్తం రూ.లక్ష కాజేసి వాళ్ల మొబైల్స్ హ్యాక్ చేసి దుర్వినియోగానికి పాల్పడ్డారు. దొంతవరంలో ధాన్యం కమీషన్ వ్యాపారికి ఇదే 92 సిరిస్ నెంబరు నుంచి మంగళవారం మధ్యాహ్నం ఫోన్ వచ్చింది. అయితే అతను కాల్ లిఫ్ట్ చేయలేదు. అపరిచిత పోన్ కాల్స్ లిఫ్ట్ చేయవద్దని, ఎటువంటి విలువైనా సమాచారం ఇవ్వవద్దని, బ్యాంకు, పోలీసు అధికారులు ఫోన్ల ద్వారా విలువైనా సమాచారం అడగరని, అటువంటి కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్ తెలిపారు.

కొనసాగిన టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (ఎపి టెట్-2024) మంగళవారం ప్రశాంతంగా సాగాయి. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ పాఠశాలలో ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 185 మందికి 163 మంది హాజరయ్యారు. 22 గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2:30 నుంచి ఐదు గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 185 మందికి 168 మంది హాజరవ్వగా 17 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

చింతలపూడి ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్



రోగులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం పిహెచ్‌సిలో ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ బెడ్‌షీట్లు తక్షణమే మార్పించాలన్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించకపోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యమే మనకు ముఖ్యమన్నారు. పేషెంట్ల ఓపీలను పరిశీలించారు. వైద్యాధికారులు విధులకు సకాలంలో హాజరు కావాలని, గ్రామాల్లో ఎఎన్‌ఎంలు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉందని స్థానిక నాయకులు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పద్ధతులను అందిపుచ్చుకోవాలి

రైతులకు జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాష సూచన

రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బాష

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులందరూ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంభించి వ్యవసాయంలో సాగు ఖర్చును తగ్గించుకుని ఆదాయం పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాష రైతులకు సూచించారు. మండలంలోని కొరగుంటపాలెం, పెదగొన్నూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న షేక్ హబీబ్ బాష మాట్లాడుతూ తొలకరిలో విరివిగా పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి పూసరాన్ని పెంచుకోవాల్సిందిగా రైతాంగానికి తెలిపారు. ప్రభుత్వం రాయితీపై త్వరలోనే జింకు, జిప్సం, కల్లాల్లో ధాన్యం ఆరబెట్టుకునేందుకు పరదాలను ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. మండవల్లి ఎడిఎ జి.వెంకటమణి మాట్లాడుతూ మండలంలో గత సీజన్‌లో 950 మంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు చేసి రైతులకు భూసార పరీక్ష కార్డులు అందించనున్నట్లు తెలిపారు. భూసార పరీక్ష కార్డుల్లోని సిఫార్సుల మేరకు మాత్రమే రైతులు ఎరువులను వాడుకోవాల్సిందిగా తెలిపారు. మండల వ్యవసాయ అధికారి బొర్రా వేణుమాధవ్ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు గ్రామాలను సందర్శించి రైతులకు సూచనలు, సలహాలు అందించే ఈ కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పంట నమోదు పూర్తయినందున రైతులందరూ విధిగా తమ వేలిముద్రలు వేసి ఇ కెవైసి చేయించుకోవాలన్నారు. మండల ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ చెరువుల్లో స్టాకింగ్ డెన్సిటీ పరిమితికి మించి చేప, రొయ్య పిల్లలను వేయరాదన్నారు. అలా వేస్తే వ్యాధుల బారిన పడటానికి అవకాశం ఉందని, రైతులందరూ పరిమితి మేరకు పిల్లలను చెరువుల్లో వేయాలని ఆక్వా రైతులకు సూచించారు. ముదినేపల్లి మండల ప్రకృతి వ్యవసాయ ఇన్‌ఛార్జి గౌతమ్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని బొమ్మినంపాడు, పెదగొన్నూరు, సింగరాయపాలెం, గ్రామాల్లో పలువురు రైతులతో ప్రకృతి వ్యవసాయాన్ని చేయిస్తున్నట్టుగా తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాలకు దఫాల వారీగా విస్తరించనున్నట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి అవసరమైన కషాయాలను సింగరాయపాలెంలో తయారు చేస్తున్నట్లు చెప్పారు. కావాల్సిన రైతులు ముందుగానే తెలియజేసి తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొర్రగుంటపాలెం గ్రామ సర్పంచి రామకృష్ణ, బత్తుల రవి, తూము రవి, నిమ్మకాయల సాంబశివ, పెదగొన్నూరు గ్రామ సర్పంచి తాడంకి శిరీష, గుడివాడ వేణుగోపాలస్వామి, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణ సామాజిక బాధ్యత

నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ ప్రియాంక

ఆశా, ఆరోగ్య కార్యకర్తలతో ప్రియాంక

ప్రజాశక్తి : ఆగిరిపల్లి

సామాజిక బాధ్యతతో మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించటంలో ప్రతిఒక్కరూ పాలు పంచుకోవాలని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ కె.ప్రియాంక అన్నారు. ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల యువత జీవితాలు నిర్వీర్యమవుతున్నాయని, సోషల్ మీడియా నెట్‌వర్కింగ్, సైట్‌లకు యువత బానిసలై తమ జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారన్నారు. ఈ రకమైన సమస్యలతో బాధపడేవారికి అనుభవం కల్గిన సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులచే నీతోడు మానసిక వికాస కేంద్రంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జె.జగన్మోహనరావు, ఎంపిహెచ్ఇఒ జి.రత్నబాబు, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్లు డి.వెంకటేశ్వరరావు, ఎన్.దేవమణి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో నీలిమ ప్రతిభ

ఎంఎల్ఎ రోషన్‌కుమార్ అభినందన

ప్రజాశక్తి - చింతలపూడి

ఇంటర్ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో గోల్కొండ నీలిమ పతకాలు సాధించడం అభినందనీయమని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. 2024 ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో డిస్కస్ త్రోలో గోల్డ్ మెడల్, జావెలిన్ త్రోలో బ్రాంజ్ మెడల్ సాధించిన నీలిమను ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా చేస్తానని హామీ ఇచ్చారు. మహిళలు క్రీడల వైపు మొగ్గు చూపటం అభినందనీయమని, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు క్రీడల వైపు అడుగులు వేయాలని కోరారు. హోమ్‌గార్డ్‌గా పని చేస్తూ, ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వడం అభినందించాల్సిన విషయమన్నారు. భవిష్యత్తులో మండలం నుంచి నేషనల్‌కి ఎక్కువమంది క్రీడాకారులు పాల్గొని చింతలపూడికి మంచి పేరు తీసుకొచ్చే విధంగా కోచింగ్ ఇవ్వాలని కోరారు. అనంతరం కోచ్ సూరిబాబు మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితులు బాగోకపోయినా నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ముందుకు వస్తే కోచింగ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. నీలిమ మాట్లాడుతూ ఫైర్ స్టేషన్‌లో పనిచేస్తున్న హోం గార్డ్ సూరిబాబు కోచింగ్ స్ఫూర్తితో భువనేశ్వర్‌లో జరిగే ఆలిండియా నేషనల్‌కి, గుంటూరులో జరిగే సౌత్ ఇండియన్ నేషనల్‌కి ఎంపికయ్యాయని తెలిపింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజా, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'పొలంబడి'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని నర్సాపేట, వెంకటాయపాలెం గ్రామాల్లో వ్యవసాయ అనుబంధ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పెట్టుబడులు తగ్గించుకునే విధంగా సూచనలు చేశారు. వరి, మామిడి, కూరగాయల పైర్లలో తీసుకోవాల్సిన పోషణల గురించి వివరించారు. అనంతరం వరిలో కాండం తొలుచు పురుగు, సుడిదోమ, నివారణకు ఎసిపేట్ 1.5 గ్రాములకు ఒక లీటర్ నీరు, వేప నూనె రెండు గ్రాములకు ఒక లీటర్ నీరు కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వరి పైరు పొట్ట దశలో ఉన్నప్పుడు ఎరువులు వేయకూడదని తెలిపారు. మామిడి రైతులకు పూత, పింద రాలకుండా ఉండడానికి జీవామృతం తయారు చేసే విధానం చూపించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి, ఉద్యాన శాఖాధికారి ఆర్.హేమ, విహెచ్ఎ ఆంజనేయులు, గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : రైతులకు వ్యవసాయంలో సాంకేతిక మెళకువలు గురించి అవగాహన కల్పించి, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా చేయడమే పొలం పిలుస్తుంది కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నూజివీడు మామిడి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని వడ్లమాను గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మామిడి, మినుము పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు, ఉద్యానశాఖాధికారి కె.జ్యోతి ప్రియాంక, వ్యవసాయ విస్తరణాధికారి కె.ధనబాబు, గ్రామ ప్రముఖులు జలసూత్రం వంశీకృష్ణ, గ్రామ ఉద్యాన సహాయకులు సాయి, సతీష్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

సమావేశంలో మాట్లాడుతున్న ఇఇ శ్రీనివాసరావు

విద్యుత్ శాఖ ఆకస్మిక దాడులు

రూ.9.78 లక్షలు జరిమానా

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల గృహాలు,వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై మీటర్లను పరిశీలించారు. విజిలెన్స్ ఇఇ సిహెచ్.వాసు ఆధ్వర్యంలో 42 బృందాలుగా ఏర్పడి చేసిన ఈ తనిఖీల్లో 248 సర్వీస్ మీటర్లలో అదనపు లోడు మొత్తానికి రూ.9.68 లక్షలు, రెండు సర్వీసులకు విద్యుత్ చౌర్యం చేసినందుకు రూ.పది వేలు మొత్తం వెరసి రూ.9.78 లక్షలు జరిమానా విధించినట్లు గుడివాడ ఇఇ జిబి.శ్రీనివాసరావు తెలిపారు. ఎవరైనా విద్యుత్ చౌర్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే 9440812091, 9440812086 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ తనిఖీల్లో గుడివాడ డివిజన్ పరిధిలోని రూరల్ గుడివాడ ఎడిఇ పి.కిరణ్‌బాబు, ఇతర ఎడిఇలు, ఎఇఇలు బి.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో చోరీ

ప్రజాశక్తి - ముసునూరు

ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఊరికి వెళ్లిన విషయం గమనించిన దుండగులు ఆ ఇంట్లోని వస్తువులను దొంగలించిన సంఘటన ముసునూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కొర్లకుంట శివారు సింహాద్రిపురం గ్రామానికి చెందిన రామకూరి ప్రభావతి వెలుగు కార్యాలయంలో ఇఒగా పని చేస్తుంది.ఉంగుటూరు మండలం లంకపల్లి గ్రామంలో తన వియ్యంకుడుకు ప్రమాదంలో కాలుకు గాయం కాగా పరామర్శించడానికి ఆమె తన ఇద్దరి కుమార్తెలతో కలిసి ఈ నెల ఐదో తేదీన వెళ్లి మంగళవారం తిరిగొచ్చారు. వచ్చేటప్పటికే ఇంట్లో ఉన్న బీరువాలు పగలకొట్టి ఉన్నాయి. బీరువాల్లోని సుమారు 90 కాసుల బంగారంతో పాటు రూ.2.,40 లక్షల నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వడ్డీ వ్యాపారిపై కేసు

ప్రజాశక్తి - ముసునూరు

అపరాధ వడ్డీ తీసుకుంటూ తాను సంతకాలు పెట్టిన డాక్యుమెంట్స్ తనకు ఇవ్వటం లేదని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై వడ్డీ వ్యాపారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గోపవరం పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న తిమ్మన ప్రసాద్ ఏలూరు మండలం సత్రంపాడు గ్రామానికి చెందిన మేడపాటి సుధాకర్‌రెడ్డి వద్ద రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. ఆ అప్పుతో పాటు వడ్డీ కూడా చెల్లించినా ప్రామిసరీ నోట్లు, వంద రూపాయల డాక్యుమెంట్ తనకు ఇవ్వకుండా ఇంకా వడ్డీ కట్టాలంటూ ఆవేదనకు గురిచేస్తున్నాడని తిమ్మన ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కుమార్తె కన్పించడంలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - ముసునూరు

తమ కుమార్తె కన్పించడంలేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఎల్లాపురం గ్రామానికి చెందిన బాలిక ఈ నెల ఆరో తేదీ నుంచి కనిపించడంలేదు. దీంతో కుటుంబసభ్యులు బాలిక కోసం వెతికారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెదవేగి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు తన కుమార్తెకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి ఉంటాడని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఎంసి చైర్మన్ పదవి ఎవరిని వరించెనో..!

కూటమి నేతల ముమ్మర ప్రయత్నాలు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ పీఠం ఎవరికి దక్కుతుందోనన్న చర్చ జోరుగా సాగుతోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త పాలక వర్గాలను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీంతో పాలకవర్గాలకు సారథ్యం వహించే చైర్మన్ పదవుల కోసం అధికార పార్టీలో పోటీ నెలకొంది. చింతలపూడి ఎఎంసి చైర్మన్ పదవి అంటేనే నాయకుల్లో తీవ్ర పోటీ నెలకొంటుంది. ఎంఎల్ఎకు ఎంత పోటీ ఉంటుందో ఇంచుమించు ఈ పదవికి అంత పోటీ ఉంటుంది. ఈ పదవి కోసం గ్రూపు పోరు నడుస్తుంది. ఈ పదవి కోసం అధిష్టానం వద్దకు గతంలో పంచాయతీలు చేశారంటే అర్థం చేసుకోవచ్చు పరిస్థితి. 2014లో టిడిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి 2018 వరకూ ఎఎంసి చైర్మన్ పదవి కోసం పోటీ జరిగింది. అంటే నాలుగేళ్లు ఎటువంటి పోటీ జరిగిందో అర్థం చేసుకోవచ్చు. చివరి సంవత్సరం 2018లో కోనేరు సుబ్బారావును ఎఎంసి చైర్మన్ పదవి వరించింది. అది కూడా ఆరు నెలలు కావటం మళ్లీ 2019లో ఎన్నికలు రావడం, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగింది. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన వైసిపి ఎంఎల్ఎ అయినా 2022 వరకు ఎఎంసి చైర్మన్ పదవి భర్తీ చేయటానికి సమయం తీసుకున్న పరిస్థితి. అంటే ఏ పార్టీ అధికారంలోకొచ్చిన, రాష్ట్రంలోనే చింతలపూడి ఎఎంసి పదవి భర్తీ అంటే అందరిలో ఆసక్తి నెలకొంటుంది. కార్యకర్తలు, నాయకుల్లో అధిష్టానం ఎవరికి అవకాశం ఇస్తారో అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం కూటమి నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఎంఎల్ఎ, ఎంపీలకు వినతిపత్రాలు అందించి తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఎంఎల్ఎ, ఎంపీని ప్రసన్నం చేసుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నలు చేస్తున్నారు. రేసులో టిడిపి సీనియర్ నాయకులు సురనేని గోపి, జనసేన మండలాధ్యక్షులు చిదరాల మధుబాబు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు, టిడిపి సీనియర్ నాయకులు గుత్త సత్యసాయివరప్రసాద్ ఉన్నారు.



సురనేని గోపి

చీదరాల మధుబాబు

సత్యసాయివరప్రసాద్

మండలంలోని నామవరం పంచాయతీకి చెందిన సురనేని శోభనాద్రి కుమారుడు గోపీ టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో కీలకంగా ఉన్నారు. నామవరం సర్పంచిగా కూడా పనిచేశారు. సురనేని గోపీనాథ్ తండ్రితో పాటుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. గోపీనాథ్ 2004లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ అత్యధిక మెజార్టీతో నామవరం పంచాయతీ సర్పంచిగా గెలుపొంది సేవలందించారు. పార్టీ సీనియర్ నాయకులుగా పేరు ఉన్న గోపీనాథ్ 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన వారిలో ఆయన ఒకరు. పార్టీ గెలిచిన తర్వాత చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌తో సన్నిహితంగా ఉండడంతోపాటు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

జనసేన మండలాధ్యక్షులు చిదరాల మధుబాబు 2021లో అప్పటి వైసిపి ప్రభుత్వం 151 సీట్లతో అధికారంలో ఉన్నప్పటికీ అధికార పార్టీకి వ్యతిరేకంగా జనసేన పార్టీలో ఏమీ ఆశించకుండా కార్పొరేట్ బ్యాంకింగ్‌లో ఉద్యోగాన్ని సైతం వదిలేసి జనసేన పార్టీలో చేరారు. చింతలపూడి మండలంలో జనసేన పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులుగా అత్యంత కృషి చేశారు. అంతేకాకుండా మండల కమిటీల నిర్మాణంలో గ్రామ కమిటీ నిర్మాణంలో నియోజకవర్గ స్థాయిలో ముందున్నారు. చింతలపూడి మండలమే కాకుండా లింగపాలెం, కామవరపుకోట మండలాలకి సహాయ సహకారాలు అందిస్తూ పార్టీని ముందుకు నడిపారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా ఏర్పడిన తర్వాత చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ విజయంలో తన వంతుగా ఎంతో కృషి చేశారు. మండలంలో ఆరు వేల మెజార్టీ రావడానికి జనసేన పాత్ర అత్యధికంగా ఉందనేది కూటమి అంగీకరిస్తుంది. కాపు సామాజిక తరగతికి చెందిన ఓట్లు కూడా కూటమికి 90 శాతం పడటానికి తన వంతుగా కృషి చేశారు. 37 ఏళ్ల యువకుడికి ఎఎంసి చైర్మన్ ఇస్తే యువతలో ఉత్సాహం వస్తుందని పలువురు చెబుతున్నారు.

జెడ్‌పిటిసి మాజీ సభ్యులు, టిడిపి సీనియర్ నాయకులు గుత్త సత్యసాయివరప్రసాద్ ఐ.అప్పలరాజుగూడెం గ్రామంలో గ్రామ పంచాయతీ ఉప సర్పంచి టిడిపిలో ప్రస్థానం మొదలుపెట్టారు. తర్వాత ఎనిమిదేళ్లధర్మాజీగూడెం పిఎసిఎస్ చైర్మన్‌గా, ఎనిమిదేళ్లు మండల ప్రెసిడెంట్‌గా, తర్వాత జెడ్‌పిటిసిగా, 2014 నుంచి తెలుగు రైతు రాష్ట్ర కార్యానిర్వహణ కార్యదర్శిగా పార్టీకి సేవలు అందిస్తూనే ఉన్నారు. పార్టీకి ఆనాటి నుంచి ఈనాటి వరకు ఆయన సేవలు అందిస్తూనే ఉన్నారు.

వీరే అర్హులు

మార్కెట్ కమిటీ పరిధిలోని సన్నకారు రైతులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తిదారులు, పశుగణం, పశుగణ ఉత్పత్తిదారులు అర్హులు. వీరిలో కనీసం ఐదుగురు సభ్యులు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ తరగతులు, మహిళలై ఉండాలి. కమిటీలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు ఉండాలి. ఇక నలుగురు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా మార్కెట్ పరిధిలోని పిఎసిఎస్, సహకార మార్కెటింగ్ సంఘాల నుంచి ఒక సభ్యుడు, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి ఒకరు, జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్యశాఖ అధికారుల్లో ఒక సభ్యుడు, మార్కెట్ కమిటీ పరిధిలోని మేయర్, మున్సిపల్ చైర్మన్, గ్రామ సర్పంచుల్లో ఒకరు ఉంటారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌ను 12 మంది రైతుల నుంచి ఒకరిని నియమిస్తారు. వైస్ చైర్మన్‌ను లైసెన్స్ ట్రేడర్స్ సభ్యుల నుంచి లేదా రైతు సభ్యుల నుంచి నియమించవచ్చు.

సభలో మాట్లాడుతన్న అధికారులు

ఉపాధి హామీ పనులపై బహిరంగ సభ

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి పనులు ఒక వరం వంటివని ప్రొసీడింగ్ అధికారి దామోదర్ అన్నారు. మండల కేంద్రమైన మండవల్లిలో మంగళవారం సామాజిక తనిఖీపై బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను వినియోగించుకుంటే మంచి లబ్ధి పొందవచ్చన్నారు. మండలంలో నిర్వహించిన ఉపాధి పనులకు రూ.7,06,90,000 కూలీలకు చెల్లించినట్లు తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన మండవల్లి మండలంలో 29 గ్రామపంచాయతీలో చేసిన ఉపాధి పనులను తనిఖీ బృందం పరిశీలించిందన్నారు. పుల్లపర్రు సచివాలయం నిర్మాణంలో రూ.1.55 లక్షలు ఆదనంగా చెల్లించినట్లు గుర్తించామని, ఆ సొమ్మును సంబంధిత పంచాయతీ ఇంజినీరింగ్ విభాగం వారి నుంచి రికవరీ చేశామని, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి కూడా రూ.28 వేలు రికవరీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఒ పురుషోత్తం, ఎస్ఆర్‌పి సూర్యచక్రం, ఎంపిడిఒ వెంకటరమణ పాల్గొన్నారు.

టి.నరసాపురం ఇఒపిఆర్‌డిగా శ్రీనివాసులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురం ఇఒపిఆర్‌డిగా బి.శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని పెదవేగిలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇఒపిఆర్‌డిగా పని చేసిన రామ్‌ప్రసాద్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పారిశుధ్యంపై శ్రద్ధ చూపుతానని చెప్పారు.

ఏకీకృత ఎన్నికలు సరికావు

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ

ప్రజాశక్తి - చింతలపూడి

దేశంలో బిజెపి అధికారాన్ని కేంద్రీకృతం చేయడం కోసమే జమిలి ఎన్నికలని, సంకీర్ణ రాజకీయ వ్యవస్థ జరుగుతున్న తరుణంలో ఏకీకృత ఎన్నికలు సరికాదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో చింతలపూడి సిపిఐ మండల జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అక్కినేని వనజ మాట్లాడుతూ జమిలి ఎన్నికలు ఎవరికి ఉపయోగం లేదన్నారు. బిజెపి అధికారాన్ని కేంద్రీకృతం చేయడం కోసమే జమిలి ఎన్నికలు తీసుకొస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు పుల్లూరు సోమశేఖర్, తొర్లపాటి బాబు, జంగా రామచంద్రారెడ్డి, బోయ రాఘవ, నాగేశ్వరరావు, గంధం అంజమ్మ, చేపల్లి శ్రీనివాసరావు, ఇస్తరాకులు వెంకటేశ్వరరావు, ఎఐవైఎఫ్ జిల్లా కోకన్వీనర్ తొర్లపాటి రాజు, ప్రజానాట్యమండలి కళాకారులు సరిపెల్లి లెనిన్ బాబు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలంలోని రాయన్నపాలెం గ్రామంలో రూ.2.30 లక్షలతో నిర్మించనున్న గోకులం షెడ్డుకు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. దసరా నాటికి గ్రామంలో తొలి గోకులం షెడ్డును ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఎంఎల్ఎ చింతమనేని మాట్లాడుతూ ఇదే గ్రామంలో మరో పది షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేశామని, రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గోకులం షెడ్డు నిర్మాణానికి రైతులకు వంద శాతం ప్రభుత్వ రాయితీ అందిస్తామని తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాయన్నపాలెం గ్రామ ప్రజలు కూటమి ప్రభుత్వానికి అండగా నిలబడడం ఎంతో అభినందనీయమన్నారు. గ్రామంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమం చేపట్టిన తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాస్, టిడిపి మండలాధ్యక్షులు బొప్పన సుధాకర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి మంచినేని శ్రీనివాసరావు, మాజీ సర్పంచి పామర్తి నాగభూషణం, మాజీ ఎంపిటిసి మానుకొండ రాంబాబు పాల్గొన్నారు.

గ్రామస్తుల విరాళంతో వాటర్‌ప్లాంటుకు మరమ్మతులు

పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ ధర్మరాజు శంకుస్థాపన

ప్రజాశక్తి ఉంగుటూరు

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

కాగుపాడులో మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్న ఎన్‌టిఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంటును గ్రామస్తులు తమ సొంత నిధులు రూ.మూడు లక్షలతో బాగు చేయించి వాడుకలోకి తేవడం అభినందనీయమని ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. కాగుపాడులో కడియాల రవిశంకర్, కడియాల రంగారావు, జాస్తి నాగేశ్వరరావు ఇచ్చిన రూ.మూడు లక్షలతో రీమోడలింగ్ చేయించిన వాటర్ ప్లాంటును ఆయన మంగళవారం ప్రారంభించారు. కొరపాటి ఆంజనేయులు కుటుంబ సభ్యులు కొరపాటి సూర్యచంద్రసుబ్రహ్మణం రూ.1.50 లక్షల సౌజన్యంతో అంబేద్కర్‌విగ్రహం వద్ద షెడ్డును నిర్మించగా ధర్మరాజు ప్రారంభించారు. జలజీవన్ మిషన్‌లో రూ.30 లక్షలతో వాటర్ ట్యాంకు, రూ.పది లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. సర్పంచి కడియాల సుదేష్ణ, టిడిపి కూటమి నాయ కులు కడియాల రవిశంకర్, ఇమ్మణి గంగాధర్, జనసేన మండలాధ్యక్షుడు పంది రాంబాబు, ఎంపిడిఒ రాజ్‌మనోజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామారావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి సూరత్తుల దుర్గాధర్ పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకోవడం అభినందనీయం

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటం అభినందనీయమని టిడిపి నాయకులు రమేష్ అన్నారు. మండలంలోని మల్లయిగూడెంలో 2006 నుంచి ఆశావర్కర్‌గా పనిచేస్తున్న మోలుగుమతి లక్ష్మీదేవి ఈ ఏడాది ఏప్రిల్ 21వ తేదీన మృతి చెందింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదు. ఆమెకు, భర్త ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాఘవాపురం పిహెచ్‌సి, ఎర్రగుంటపల్లి పిహెచ్‌సి సిబ్బంది కుమార్తెలిద్దరికీ రూ.1.30 లక్షలు వారి పేరున ఇద్దరికీ సమానంగా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ బాండ్స్ రాఘవాపురం పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్, సిబ్బంది మల్లయిగూడెం గ్రామ పెద్దల సమక్షంలో కుమార్తెలిద్దరికి అందించారు. రాఘవాపురం, ఎర్రగుంటపల్లి పిహెచ్‌సి సిబ్బందికి బాధిత కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

పార్కును అభివృద్ధి చేయాలని వినతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడులోని ఎంప్లాయీస్ కాలనీలో ఉన్న ఎంఆర్ అప్పారావు మున్సిపల్ పార్కును అభివృద్ధి చేయాలని, పార్కులో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామరెడ్డికి పలువురు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వందమందికి పైగా మహిళలు, పురుషులు, సీనియర్ సిటిజన్స్, యువకులు, విద్యార్థులు, పిల్లలు వాకింగ్, ఇతర వ్యాయామం కోసం వస్తూ ఉంటారన్నారు. మిగిలిన సమయాల్లో కూడా అనేక మంది వివిధ వృత్తులవారు, వివిధ మార్కెటింగ్ ఉద్యోగులు సమావేశం పెట్టుకునేందుకు, విశ్రమించేందుకు వస్తూ ఉంటారని చెప్పారు. పార్కులో అనేక ఏళ్ల క్రితం నాటిన చెట్లు మహావృక్షాలై వాకింగ్ ట్రాక్‌ను పూర్తిగా కప్పివేయడంతో గాలి, వెలుతురు తగ్గిపోయి సాయంకాలం దోమల సమస్య తీవ్రంగా ఉందన్నారు. పార్కు పడమటి వైపు గేట్ ముందు మురుగు కాలువ వల్ల దోమలు అధికంగా ఉంటున్నాయన్నారు. దోమల నివారణ, పార్కు నిర్వహణ, అభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంప్లాయీస్ కాలనీలోని సీనియర్ సిటిజన్స్ ఎన్ఆర్ నుమానులు, ఎ.వెంకటేశ్వరరావు, సిహెచ్.ఆంజనేయులు, కొలా వెంకటరత్నం, మహమ్మద్ సుభానిలు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉప సర్పంచి, వార్డు సభ్యులందరూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల వ్యాప్తంగా ఉన్న 12 పంచాయతీల ఉప సర్పచులు, వార్డు సభ్యులకు పంచాయతీలో పాలన అంశాలపై రెండు రోజుల పాటు శిక్షణ తరగతులలో భాగంగా మొదటి రోజు ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరూ కలిసి పంచాయతీలను అభివృద్ధి పథంలో ముందుకు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి నిఖిల్ మధు శరణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : పంచాయతీ రాజ్ చట్టాలు, హక్కులను ఉపయోగించుకుని ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలాభివృద్ధికి ఉప సర్పంచులు, వార్డు సభ్యులు దోహద పడాలని ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ అన్నారు. మండలంలో 27 గ్రామాల పంచాయతీల్లో ప్రతి గ్రామం నుంచి ఇద్దరు వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు రెండు రోజుల పాటు రిఫ్రెషమెంట్ ట్రైనింగ్ క్లాసులు మంగళవారం ఉంగుటూరులో ఎంపిపి గంటా శ్రీలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు.

ముసునూరు : గ్రామపంచాయతీ అభివృద్ధిలో సర్పంచితో పాటు ఉప సర్పంచి, వార్డు సభ్యులు కూడా తమ ప్రాధాన్యత కనబరచాలని ఎంపిడిఒ జి.రాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు రెండో రోజు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సమావేశాల్లో సర్పంచితో పాటు, వార్డు సభ్యులు కూడా పాల్గొని అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, గ్రామ సర్పంచి కొండేటి విజయలక్ష్మి, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కామవరపుకోట : మండల పరిషత్ కార్యాలయ అడ్మిస్ట్రేటివ్ అధికారి ఎస్.సత్యవేణి ఆధ్వర్యంలో ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకి మొదటి రోజు మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండలంలోని పంచాయతీల కార్యదర్శులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్ట చట్టాలు కల్పించాలని ఏలూరు జిల్లా మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. మండలంలోని బండారిగూడెంలో మంగళవారం వంజం నందిని అధ్యక్షతన మంగళవారం శాఖా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు వరకా శ్యామల, మన్నవ యామిని మాట్లాడుతూ రోజురోజుకి మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయన్నారు. లైంగిక దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను అమలు చేసి మహిళలకు, చిన్నారులకు భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వం మద్యపాన నిషేధానికి శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మడివి సమిత, మంగ, సౌందర్య, వంజం గంగ పాల్గొన్నారు.

పోలవరాన్ని కొత్తజిల్లాగా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం జిల్లా కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని పోలవరం జిల్లా సాధన సమితి నాయకులు నాళం గాంధీ డిమాండ్ చేశారు. పోలవరం జిల్లా కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేయడానికి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించడానికి ఆర్యవైశ్య కల్యాణ మండలంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాళం గాంధీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో పశ్చిమ,త ూర్పు గోదావరి జల్లాలో ముంపు మండలాలతో కొత్తజిల్లా ఏర్పాటు చేయాలని కోరారు. పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తామని అన్ని పార్టీలకు చెందిన నాయకులు స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సాధన సమితి నాయకులు బుగ్గా మురళీకృష్ణ, కొణతాల ప్రసాద్, సొబ్బన రాజశేఖర్ బాబు, ముత్యాల రాంబాబు, ముళ్ల అంజిబాబు, సిద్ధన వెంకటరత్నం, యడ్ల వినోద్, అనిశెట్టి రాధాకృష్ణ, కుడుదాల శ్రీనివాసు, దేరా వెంకన్న పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి- ముదినేపల్లి

అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానించి తహశీల్దార్ ద్వారా పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించి భవన నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని కోరుతూ మంగళవారం మాల మహానాడు ఆధ్వర్యంలో ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శేవా నాగజగన్ బాబూరావు మాట్లాడుతూ ముదినేపల్లి అంబేద్కర్ నగర్ కాలనీకి ఆనుకుని ఉన్న రీ సర్వే నెం.178/1 రు.పంచాయతీ భూమి నూతి దగ్గర నుంచి మెయిన్ రోడ్ వరకు ఉన్న ఖాళీ స్థలాన్ని అంబేద్కర్ భవన నిర్మాణం కోసం గత 40 ఏళ్లుగా గ్రామస్తులు ఆపుకున్నారన్నారు. సదరు స్థలంలో అంబేద్కర్ భవనం నిర్మాణం కోసం ముదినేపల్లి గ్రామ పంచాయతీ బోర్డు తీర్మానించి తహశీల్దార్ ద్వారా పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించి, భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని ఎంఎల్ఎను కోరారు.

పారదర్శకంగా మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ

ఎక్సైజ్ సిఐ అశోక్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్‌కుమార్, చింతలపూడి సిఐ రవీంద్ర అన్నారు. చింతలపూడి పట్టణంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద టెండర్ల ప్రక్రియను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో టెండర్లు వేసేవారు వేయవచ్చుని, ఎవరైనా ఇబ్బంది పెడితే తెలియజేయాలని చెప్పారు. చింతలపూడి సర్కిల్-4 స్టేషన్ పరిధిలో 175 టెండర్లు వచ్చాయని, 300 వరకు పడే అవకాశం ఉందని తెలిపారు. తొమ్మిదో తేదీ సాయంత్రం వరకు అవకాశం ఉందని, 11వ తేదీన డ్రా తీస్తారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు - నూజివీడు లో

ఇ.పి.నెం. 19/2015 ఇన్ యల్.ఏ.ఓ.నెం. 22/2011

బిట్వీన్:

చాగంటి సుబ్బారావు ...డి.హెచ్.ఆర్/క్లైమెంట్

ది రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్, నూజివీడు ...జే.డి.ఆర్

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి పై తెలిపిన **జే.డి.ఆర్.** యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో వుండి పై తెలిపిన **జే.డి.ఆర్.** గారి కార్యాలయంలో ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు ఛార్జి కాబడి, వేలం కావలసియున్న చరాస్థి వివరం:

1.	5 - ఐరన్ బీరువాలు -	రూ. 15,000/-
2.	10 - ఫైబర్ కుర్చీలు -	రూ. 2,500/-
మొత్తం		రూ. 17,500/-

డి.హెచ్.ఆర్ విలువ రూ. 17,500/-
అమీనా విలువ రూ. 7,500/-

పైన తెలిపిన ఆస్థిని శ్రీ కోర్టు వారు ది. 17 -10-2024 వ తేదీన ఉ.గం. 10-30 ని.ల బహిరంగ వేలం వేయుదురు. కావున కావాల్సినవారు పాడుకొనవచ్చును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

యమ్. రమేష్
డి.హెచ్.ఆర్.తరపు న్యాయవాది
నూజివీడు

నూజివీడు
ది.08-10-2024
సెల్: 94402 57636